క్లుప్తంగా

రక్త నమూనాల సేకరణ



ఉండవెల్లి: మండలంలోని మెన్నిపాడులో పశువులకు గాలికుంటు వ్యాధి నివారణకు మహబూబ్‌నగర్‌లోని పశువ్యాధి నిర్ధారక కేంద్రం డా.కరుణశ్రీ 50 పశువులకు రక్త నమూనాలను సేకరించారు. అనంతరం పాడి రైతులతో మాట్లాడి సూచనలు, సలహాలు ఇచ్చారు. కార్యక్రమంలో పశువైద్యాధికారి శిరీషా, సిబ్బంది మాసుమన్న, మురళీ, కృష్ణ, శాంతి, నరేష్, ప్రవీణ్, బాషా, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

ఆలయ నిర్మాణానికి విరాళం

మానవపాడు: మండలంలోని నారాయణపురం గ్రామంలోని బాలయోగి శివనారాయణ స్వామి ఆలయ నిర్మాణానికి శనివారం నరేష్ రూ.50వేలు విరాళంగా అందజేశారు. ఆలయ అభివృద్ధి ఎల్లప్పుడు సహకరిస్తామని తెలిపారు.

కేంద్ర ప్రభుత్వ పథకాలపై అవగాహన



ఎర్రవల్లిచౌరస్తా: ఎర్రవల్లి మండల పరిధిలోని బీ.వీరాపురంలో శనివారం బీజేపీ మండలాధ్యక్షుడు జగదీష్ ఆధ్వర్యంలో కేంద్ర ప్రభుత్వం అందిస్తున్న పథకాలపై ప్రజలకు అవగాహన కల్పించారు. పేద ప్రజల అభ్యున్నతికి కేంద్ర ప్రభుత్వం ఎన్నో సంక్షేమ పథకాలను ప్రవేశపెట్టిందన్నారు.

అయిజ: మండలంలోని తొత్తినోనిదొడ్డిలో శనివారం బీజేపీ నాయకులు గావ్ చలో కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో రాష్ట్ర బీజేపీ మైనార్టీ మోర్చా అధ్యక్షుడు అఫ్సర్ పాషా పాల్గొన్నారు.

గావ్ చలో అభియాన్

ధరూరు: బీజేపీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న గావ్ చలో అభియాన్ కార్యక్రమంలో శనివారం మండల కేంద్రంలో నిర్వహించారు. నరేంద్రమోదీ నేతృత్వంలో అన్ని విధాలా అభివృద్ధి పనులు చేస్తున్నామని బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు కుర్వ కిష్టన్న తెలిపారు.

విద్యతోనే సమగ్ర అభివృద్ధి


గట్టు: విద్యతోనే సమగ్ర అభివృద్ధి సాధ్యమని, తల్లిదండ్రులు వారి పిల్లలను తప్పని సరిగా పాఠశాలకు పంపాలని ఎంపీపీ విజయ్ కుమార్ కోరారు. శనివారం బోయలగూడెం ఉన్నత పాఠశాలలో విద్యార్థులు, తల్లిదండ్రులు, ఉపాధ్యాయులతో ముఖాముఖి కార్యక్రమాన్ని నిర్వహించారు. వైస్ ఎంపీపీ సుమతి మాట్లాడుతూ కర్ణాటక సరిహద్దులో ఉన్న బోయలగూడెం పాఠశాలలో సమస్యలు నెలకొన్నాయని, ఉపాధ్యాయుల కొరత, ప్రహరీ గోడ నిర్మాణం లేక విద్యార్థులు ఇబ్బంది పడుతున్నట్లు తెలిపారు. సొంత ఖర్చులతో విద్యార్థులకు ఉపయోగపడే ఎగ్జామినేషన్ కిట్టును ఎంపీపీ విద్యార్థులకు అందజేశారు.

బాధ్యతలు స్వీకరించిన ఎస్‌ఐలు

అయిజ: పట్టణ ఎస్‌ఐగా నరేష్ శనివారం బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. సమస్యల పరిష్కారానికి నిరంతరం కృషిచేస్తానని తెలిపారు. సమస్యలు ఉన్నవారు నేరుగా పోలీస్‌స్టేషన్‌కు వచ్చి ఫిర్యాదు చేయాలని, అత్యవసరం అయితే ఫోన్‌లో కూడా సంప్రదించవచ్చని సూచించారు.

ఎర్రవల్లిచౌరస్తా: కోదండాపురం ఎస్‌ఐగా రజిత శనివారం బాధ్యతలు చేపట్టారు. గతంలో ఇక్కడ విధులు నిర్వహిస్తున్న ఎస్‌ఐ కృష్ణదేవా బదిలీపై నారాయణపేట రూరల్‌కు వెళ్లారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు జిల్లా ఐటీకోర్ నుంచి బదిలీపై వచ్చినట్లు ఆమె తెలిపారు. కార్యాలయంలో బాధ్యతలు చేపట్టిన అనంతరం ఆమె మాట్లాడుతూ.. పీఎస్ పరిధిలోని శాంతి భద్రతల పరిరక్షణ కోసం తన వంతు కృషిచేస్తానని పేర్కొన్నారు.

ఘనంగా పప్పుధాన్యాల దినోత్సవం



ఎర్రవల్లిచౌరస్తా: ఇటిక్యాల మండలంలోని చాగాపురంలో శనివారం అంతర్జాతీయ పప్పుధాన్యాల దినోత్సవాన్ని నిర్వహించారు. స్థానిక ఏఈఓ భరత్ రైతువేదికలో పప్పు ధాన్యాల ఆవశ్యకతపై రైతులకు అవగాహన కల్పించారు. ఆహార భద్రత, పోషకాహారం కోసం ఉద్దేశించిన స్థిరమైన ఆహార ఉత్పత్తిలో భాగంగా పోషక ప్రయోజనాల గురించి అవగాహన కల్పించడానికి ప్రభుత్వం అవకాశం కల్పిస్తుందన్నారు. వివిధ రకాల పప్పుధాన్యాల వల్ల వచ్చే పోషకాల గురించి వివరించారు.

యాసంగి సాగుపై నిరాశ

- రాజోళి మండలంలో 3వేల నుంచి వెయ్యి ఎకరాలకు తగ్గిన వరి సాగు
- ఎండిన వాగులు, అడుగంటిన తుంగభద్ర
- బోర్లు ఉన్నచోట మాత్రమే నాటు వేస్తున్న రైతులు



బోర్ల సౌకర్యం ఉన్నచోట సాగు చేసిన వరిపంట



వాగులో నీరు లేక మాన్‌దొడ్డిలో నాట్లు వేయని పొలం

రాజోళి: మండలంలో యాసంగి సాగుపై రైతులు ఆశలు వదులుకున్నారు. మండల కేంద్రంతో పాటు మాన్‌దొడ్డి, పడమటి గార్లపాడు, తూర్పుగార్లపాడు, తుమ్మిళ్ల, పెద్ద ధన్వాడ నది తీర గ్రామాల్లో ప్రతి ఏడాది వేల ఎకరాల్లో సాగయ్యే వరి పంట ఈ ఏడాది పూర్తి స్థాయిలో తగ్గుముఖం పట్టింది. సరైన వర్షాలు లేని కారణంగా నీటి వనరులు ఎండిపోవడంతో, రైతులు నాట్లు వేసేందుకు ముందుకు రావడం లేదు. తమకున్న బోర్లకింద, లేదా పొలాల పక్కనే రైతులు ఇచ్చే నీటిపై ఆధారపడి కొద్ది మొత్తంలో వరి నాట్లను వేస్తున్నారు.

నీటి ఎద్దడే కారణం..

ప్రతి ఏడాది ఎగువ నుంచి వచ్చే నీటితో తుంగభద్ర నదిలో నీరు ఉండటంతో పాటు, దాని నుంచి ఆర్డీఎస్ కెనాల్ కొంత మేర, ఆయా గ్రామాల్లో ఉండే వాగులకు నీరు అందేది. దీంతో వానాకాలం సీజన్ పూర్తయ్యే సమయానికి రైతులు నాట్లకు సిద్ధమయ్యేవారు. ప్రస్తుతం రైతులకు సరైన నీటి సౌకర్యం లేదు. నదిలో నీరు రాకపోవడం, వర్షాలు కూడా కురవకపోవడంతో నాట్లు వేసేందుకు ధైర్యం చేయలేకపోతున్నారు. నాట్లు వేశాక నీరు సరిపోకపోతే రూ.లక్షల్లో నష్టం తప్పదని, ఇప్పటికే ఖరీఫ్‌లో పెట్టుబడి పెట్టి నష్టపోయామని, మళ్లీ నష్టపోయేందుకు సిద్ధంగా లేమని రైతులు అంటున్నారు. ఎక్కువగా నదీతీర గ్రామాల్లో వరి నాట్లు వేసేవారు. ప్రస్తుతం నదిలో నీరు మొత్తం ఇంకిపోయే పరిస్థితి ఎదురైంది. దీనికి తోడు సరైన వర్షాలు లేక భూగర్భజలాలు అడుగంటాయనే ఆందోళన వేధిస్తుంది. దీంతో బోర్ల సౌకర్యం ఉన్న చోట సాగు చేసేందుకు కూడా రైతులు విముఖత చూపుతున్నారు. సాగు మధ్యలో జలాలు అడుగంటిపోతే పరిస్థితి ఏంటని ఆవేదన చెందుతున్నారు. గతంలో ఉన్న నీటి వనరులు ప్రస్తుతం లేవని, వానాకాలం సీజన్‌లోనే కోటి ఆశలతో సాగు మొదలుపెడితే పత్తి, మిరప ఇతర పంటలు సరైన వర్షాలు లేక పూర్తిగా ఎండిపోయి రూ.లక్షల అప్పులు మిగిలాయని వాపోతున్నారు.

వెయ్యి ఎకరాల్లో..

గతేడాది మండలంలో దాదాపుగా 3వేల ఎకరాల వరి నంట సాగయ్యింది. ఈ యాసంగిలో ఇప్పటి వరకు ఇంకా వెయ్యి ఎకరాల మార్కు దాటలేదని అధికారుల లెక్కలు చెబుతున్నాయి. గతేడాది జనవరిలోనే నాట్లు పూర్తయ్యాయని, ప్రస్తుతం ఇంకా రైతులు అక్కడక్కడా నాట్లు వేస్తున్నారని తెలుస్తుంది. అంతా సాగు భూమిగానే ఉన్నప్పటికీ మొత్తం విస్తీర్ణంలో సాగు చేయకుండా కొద్దిమేర మాత్రమే నాట్లు వేస్తున్నారు. మరికొందరైతే పశువులకు గ్రాసమైనా వస్తుందా లేదా అనుమానాలున్నాయని, ఫిబ్రవరిలోనే ఎండలు ముదురుతుండటంతో పంట చేతికొచ్చేలోగా వాతావరణంలో ఎలాంటి మార్పులు ఉంటాయో, నీటి లభ్యత ఎక్కువగా లేకపోయినందున అది చేతికొస్తుందా లేదా అని నాట్లు వేయడం మానుకున్నారు. ప్రతి యాసంగిలో ఈ సమయానికి పచ్చని వరి పైర్లతో కళకళలాడే నదితీర గ్రామాలు నేడు ఎండిన భూములతో దర్శమిస్తున్నాయి. ఇంత భారీగా నాట్లు తగ్గడం వల్ల మార్కెట్‌లో బియ్యం ధరలు కూడా ఆకాశాన్నంటే అవకాశం లేకపోలేదని రైతులు అంటున్నారు.

నాలుగు ఎకరాల్లోనే సాగు..



ప్రతి ఏడాది 7 ఎకరాల వరకు వరి సాగు చేసేవాన్ని. నదిలో నీరుండటంతో మా గ్రామంలోని వాగులు నిండుగా ఉండి మాకు పుష్కలంగా నీరు అందేది. ప్రస్తుత ఏడాది బోర్ల కిందనే సాగు చేయాల్సి ఉంది. వర్షాలు కూడా కురవని కారణంగా భూగర్భజలాలు తగ్గి ఉంటాయనే అనుమానం ఉంది. అందుకనే నాలుగు ఎకరాల్లోనే నాట్లు వేశాను.

– రమేష్, వరి రైతు, మాన్‌దొడ్డి

సాగు తగ్గింది



మండలంలో గతేడాది ఈ సమయానికి 3వేల ఎకరాల వరకు నాట్లు పడేవి. ప్రస్తుతం వెయ్యి ఎకరాల వరకు నాట్లు పడేలా ఉన్నాయి. ఇంకా చాలా చోట్ల రైతులు నాట్లు వేసేందుకు ఆలోచిస్తున్నారు. నీటి అవసరం ఎక్కువగా ఉన్న పంట కావడంతో నీటి లభ్యత కూడా ఎక్కువగా ఉండాలి. నదిలో వాగుల్లో నీరు లేకపోవడం వల్ల సాగు బాగా తగ్గింది.

– చంద్రశేఖర్, వ్యవసాయ అధికారి, రాజోళి

మీసేవ కేంద్రం నిర్వాహకుడిపై విచారణ

సాక్షి ఎఫెక్ట్..



మాన్‌దొడ్డి మీసేవను తనిఖీ చేస్తున్న డీఎం సుధాకర్‌రెడ్డి

రాజోళి: మండలంలోని మాన్‌దొడ్డిలో గల మీ సేవ కేంద్రంపై అధికారులు శనివారం విచారణ చేపట్టారు. ప్రజలకు అందుబాటులో లేని మీ సేవ కేంద్రంపై 'సాక్షి'లో వచ్చిన వరుస కథనాలకు స్పందించిన జిల్లా మీసేవ మేనేజర్ సుధాకర్‌రెడ్డి గ్రామంలో విచారణ చేపట్టారు. మీ సేవ నిర్వాహకుడు కేంద్రాన్ని తెరవకుండా, వైన్‌షాపు ద్వారా మద్యాన్ని గ్రామాల్లోని బెల్టు షాపులకు సరఫరా చేస్తున్నాడని 'సాక్షి'లో వచ్చిన కథనంపై ఆయన గ్రామంలో విచారణ చేశారు. దీని కోసం మీసేవ కేంద్రాన్ని తనిఖీ చేసి, గ్రామంలో పలువురుని మీ సేవ కేంద్రం ద్వారా అందుతున్న సేవల గురుంచి అడిగి తెలుసుకున్నారు. నిర్వాహకుడు అందుబాటులో ఉంటున్నాడా, షాపు తెరుస్తున్నారా లేదా అనే ప్రశ్నలను అడిగి వివరాలు నమోదు చేసుకున్నారు. విచారణ అనంతరం నివేదికను ఉన్నతాధికారులకు అందచేయనున్నట్లు ఆయన తెలిపారు.

ప్రతి విద్యార్థి ఇష్టపడి చదవాలి



నృత్య ప్రదర్శన చేస్తున్న విద్యార్థినులు

ధరూరు: విద్యార్థులు కష్టపడి కాకుండా ఇష్టపడి చదవివితే అనుకున్న లక్ష్యాన్ని చేరుకోవడం కష్టమేమి కాదని జిల్లా ఇంటర్మీడియట్ అధికారి హృదయారాజ్ అన్నారు. శనివారం మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ప్రిన్సిపాల్ కృష్ణ అధ్యక్షతన ఇంటర్ విద్యార్థుల వీడ్కోలు సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో వారు మాట్లాడారు. కళాశాలలో ఇప్పటి వరకు వస్తున్న ఫలితాలు చాలా బాగుతున్నాయని, రాష్ట్ర స్థాయిలో పోటీలో ఉండే విధంగా సిద్ధం కావాలన్నారు. బాగా చదివి కళాశాలకు, కన్న వారికి మంచి పేరు తీసుకు రావాలని తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. కార్యక్రమంలో మల్దకల్ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ రమేష్ లింగ, అధ్యాపకులు పాల్గొన్నారు.

అనుమతి లేకుండా ఇసుక తరలించొద్దు



తహసీల్దార్ కార్యాలయంలో ఇసుక

రాజోళి: అనుమతులు లేకుండా ఇసుక తరలిస్తే చర్యలు తప్పవని తహసీల్దార్ జోషి శ్రీనివాస్ శర్మ తెలిపారు. గతంలో చిన్నధన్వాడ నుంచి ఇసుక తీసుకువస్తున్న ట్రాక్టర్లను పోలీసులు పట్టుకుని స్టేషన్‌కు తరలించి కేసు కోసం మైనింగ్ అధికారులకు అప్పజెప్పారు. కాగా అందులో ఉన్న ఇసుకను శనివారం తహసీల్దార్ కార్యాలయంలో డంప్ చేసుకున్నారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ.. ప్రభుత్వ అనుమతుల ద్వారానే, ప్రజలు అవసరాలు, ప్రభుత్వ పనులకు ఇసుక అనుమతి లభిస్తుందని, అక్రమంగా ఎవరైనా ఇసుకను తరలిస్తే కేసులు నమోదు చేసి చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

వారం రోజుల్లో లైసెన్సులు తీసుకోండి



శాంతినగర్ పోలీస్‌స్టేషన్‌లో ఇసుక ట్రాక్టర్లు

శాంతినగర్: ఇసుక తరలించే ట్రాక్టర్ డ్రైవర్లు వారం రోజుల్లో డ్రైవింగ్ లైసెన్సులు తీసుకోవాలని శాంతినగర్ ఎస్‌ఐ సంతోష్‌కుమార్ ఆదేశించారు. తుంగభద్ర నది నుంచి ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్లను శాంతినగర్ సమీపంలో నిలిపి అనుమతులున్నాయా లేదా అని శనివారం ఆయన తనిఖీ చేశారు. 30 ట్రాక్టర్ల డ్రైవర్లకు లైసెన్సులు లేవని, ఇన్సూరెన్స్ కట్టడం లేదని ఎస్‌ఐ నిర్ధారించారు. దీంతో ట్రాక్టర్లను పోలీస్ స్టేషన్‌కు తరలించారు. డ్రైవర్లకు కౌన్సెలింగ్ ఇచ్చి జరిమానా వేశారు. వారం రోజుల్లో అన్ని ట్రాక్టర్లకు ఇన్సూరెన్స్ కట్టాలని లేకుంటే సీజ్ చేస్తామని హెచ్చరించారు.

గుంతలరోడ్డుతో ఇక్కట్లు



ఉండవెల్లి, కంచుపాడు మధ్య గుంతలతో రహదారి

ఉండవెల్లి: మండల కేంద్రం నుంచి కంచుపాడు, వయా మారమునగాల వెళ్లే రహదారి గుంతలమయంగా మారింది. దీంతో వాహనాలు వెళ్లే వెళ్లే క్రమంలో అనేక ఇబ్బందులు పడాల్సిన పరిస్థితి నెలకొంది. గుంతలతో ప్రమాదం పొంచి ఉందని స్థానికులు వాపోతున్నా, అధికారులు పట్టించుకోవడం లేదని అంటున్నారు. ఇప్పటికైనా మరమ్మతు చేపట్టాలని కోరుతున్నారు.

రోడ్డు నిబంధనలు పాటిస్తేనే రక్షణ



మాట్లాడుతున్న డీఎస్పీ వెంకటేశ్వర్లు



రోడ్డు ప్రమాదాలపై ప్రదర్శన

అలంపూర్: వాహనదారులు రోడ్డు భద్రత నిబంధనలు పాటిస్తేనే రక్షణ ఉంటుందని డీఎస్పీ వెంకటేశ్వర్లు అన్నారు. అలంపూర్‌చౌరస్తా సమీపంలోని పుల్లూరు టోల్‌ప్లాజా కార్యాలయంలో రోడ్డు భద్రత వారోత్సవాలను శనివారం నిర్వహించారు. కార్యక్రమానికి డీఎస్పీ, అలంపూర్ సీఐ రాజు, పుల్లూరు టోల్‌ప్లాజా ప్రాజెక్టు మేనేజర్ బాలగణేష్ హాజరయ్యారు. ఈ సందర్భంగా డీఎస్పీ మాట్లాడుతూ.. వాహనదారులు నిబంధనలు పాటిస్తేనే ప్రమాదాలను నివారించడానికి అవకాశం ఉంటుందన్నారు. అతివేగం, నిర్లక్ష్యంగా వాహనాలను నడపవద్దన్నారు. వాహనాలు నడిపే సమయంలో సెల్‌ఫోన్‌లు మాట్లాడవద్దన్నారు. బైక్ నడిపే వారు హెల్మెట్, కారు నడిపే వారు తప్పకుండా సీట్ బెల్టు పెట్టుకోవాలన్నారు. మద్యం సేవించి వాహనాలు నడపటం ప్రమాదమని చట్టరీత్యానేరమని తెలిపారు. అనంతరం రోడ్డు భద్రతలో భాగంగా కళాకారులు వీధి నాటకాన్ని ప్రదర్శించారు. ఈ సందర్భంగా నిర్వహించిన డ్రాయింగ్, వ్యాసరచన పోటీల్లో గెలుపొందిన విజేతలకు బహుమతులను అందజేశారు. సేఫ్టీ మేనేజర్ ఆదిత్య, సురేష్, నరేష్, మల్లయ్య, దుర్గ, శ్రీధర్ పాల్గొన్నారు.

ఆలయ నిర్మాణానికి భూమిపూజ



గట్టు: మండలంలోని పెంచికలపాడులో గ్రామ దేవత ఆలయానికి శనివారం భూమి పూజ నిర్వహించారు. గ్రామంలో కర్రెమ్మ దేవాలయాన్ని నిర్మించేందుకు గ్రామస్తులు నిర్ణయించుకున్నారు. కార్యక్రమంలో నాగరాజు, సిద్దప్ప, మహానందిరెడ్డి, నర్సింహులు, నాగేందర్‌రెడ్డి, నవీన్‌కుమార్‌రెడ్డి, శివప్ప, మహ్మద్, రాఘవేంద్ర, హనుమంతు, మల్దకల్, నర్సింహులు, చౌడప్ప పాల్గొన్నారు.

ఇసుక టిప్పర్ పట్టివేత



కేటీదొడ్డి: ప్రభుత్వం నుంచి అనుమతి లేకుండా ఇసుక తరలిస్తున్న టిప్పర్‌ను పోలీసులు శనివారం స్వాధీనం చేసుకున్నారు. ఎస్‌ఐ శ్రీనివాస్‌రావు తెలిపిన వివరాల మేరకు ఇలా.. గద్వాల మండలం గోనుపాడుకు చెందిన ముష్టి శివన్న గద్వాల నుంచి కేటీదొడ్డి మండల కేంద్రం వైపు వస్తున్న సమయంలో మధ్యాహ్నం తహసీల్దార్ కార్యాలయ మిట్ట వద్ద వాహనాన్ని తనిఖీ చేయగా అందులో ఇసుక ఉన్నట్లు పోలీసులు గుర్తించి స్టేషన్‌ను తరలించారు. ముష్టి శివన్న, డ్రైవర్ శాంతన్న దగ్గర ఎలాంటి పత్రాలు లేకపోవడంతో ఇద్దరిపై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు.

ఆలయాల్లో భక్తుల పూజలు



ఆదిశిలా క్షేత్రంలో ప్రత్యేక పూజలు చేస్తున్న భక్తులు

మల్దకల్: మండలంలోని వివిధ ఆలయాలో భక్తులు శనివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. మల్దకల్ స్వయంభూ లక్ష్మీవేంకటేశ్వరస్వామి, సద్దలోనిపల్లి కృష్ణస్వామి, కుర్తిరావులచెర్వు గట్టు తిమ్మప్ప, శేషంపల్లి శివసీతారామస్వామి, చర్లగార్లపాడు వేంకటేశ్వరస్వామి ఆలయాల్లో పూజలు చేశారు. అర్చకులు స్వామి వారికి అభిషేకాలు నిర్వహించి భక్తులకు తీర్థప్రసాదాలను అందజేశారు. కొంతమంది స్వామి వారికి దాసంగాలు పెట్టి నైవేద్యాలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు.

కల్వర్టుకు మోక్షమెన్నడో?

- రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు
- తరుచూ ప్రమాదాలు



కేటీదొడ్డి శివారులో వర్షాలకు దెబ్బతిన్న కల్వర్టు

కేటీదొడ్డి: వర్షాల దాటికి ఏడాది క్రితం మండల కేంద్రంలోని పోలీస్‌స్టేషన్ వద్ద గద్వాల–రాయచూర్ ప్రధాన రహదారిపై కూలిన కల్వర్టును నిర్మించేందుకు నేటికి మోక్షం లభించలేదు. వర్షం వచ్చిందంటే చాలు ఈ కల్వర్టు దాటేందుకు చుట్టు పక్కల గ్రామాల ప్రజలు అవస్థలు పడుతుంటారు. అయినా పాలకులు, అధికారులు మరమ్మతులపై శ్రద్ధ చూపడం లేదు. ప్రతిరోజు వందలాది మంది ప్రయాణికులు ఈ రహదారాపై రాకపోకలు సాగిస్తున్నారు.

ముందుకు సాగని పనులు..

ధ్వంసమైన కల్వర్టును మరమ్మతు చేయాలని మండల ప్రజలు అధికారులకు చెప్పినా ఏ మాత్రం చలనం రాలేదు. రాయచూర్ నుంచి గద్వాల వెళ్లే ప్రధాన రహదారి కావడంతో నిత్యం రద్దీగా ఉంటుంది. ఈ రోడ్డుపై అనేక సార్లు ప్రమాదాలు కూడా చోటు చేసుకున్నాయి. అయినా ఎక్కడ వేసిన గొంగడి అక్కడే అన్నట్లు కల్వర్టు పనులు ముందుకు సాగడం లేదు. కేటీదొడ్డి, ఉమిత్యాల సమీపంలోని కల్వర్టుతో పాటు రోడ్డు కూడా ధ్వంసమైంది. భారీ వర్షం కురిస్తే కల్వర్టు తెగిపోయే ప్రమాదం ఉందని ప్రయాణికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు నిర్లక్ష్యాన్ని వీడి మరమ్మతులు చేయాలని ప్రజలు కోరుతున్నారు.

పట్టించుకోవడం లేదు



కల్వర్టు తెగి ఏడాది దాటినా అధికారులు మరమ్మతు చేయడం లేదు. ఎన్నో సార్లు ఫిర్యాదు చేశాం. అయినా పట్టించుకోలేదు. ఈ రోడ్డుపై అనేక సార్లు ప్రమాదాలు జరిగాయి. ఇప్పటికైనా అధికారులు కల్వర్టు పనులను త్వరగా పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలి.

– మైబు, కేటీదొడ్డి

మరమ్మతు చేయిస్తాం

అక్కడక్కడ కల్వర్టులు తెగినట్లు మా దృష్టికి వచ్చింది. టెండర్లు కూడా పూర్తి అయ్యాయి. వాటిని త్వరలోనే మరమ్మతు చేయిస్తాం.

– రాజేశ్వరి, ఆర్‌అండ్‌బీ ఏఈ, కేటీదొడ్డి

కామ్రేడ్ ప్రభాకర్‌కు ఘననివాళి



ఎర్రవల్లిచౌరస్తా: ఎర్రవల్లి మండల కేంద్రంలో శనివారం యాక్తాపురంకు చెందిన కామ్రేడ్ ప్రభాకర్ వర్ధంతిని వివిధ ప్రజా సంఘాల ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఎర్రవల్లి కూడలిలో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి కొవ్వొత్తులతో నివాళులర్పించారు. కార్యక్రమంలో కావలి మన్యం, భీమేశ్వరెడ్డి, రాగన్న, ధర్మారెడ్డి, లక్ష్మన్న, అనిల్, తిమ్మన్న, గుమ్మగోవర్దన్, దశరథం, రాముడు తదితరులు ఉన్నారు.

ఉద్యోగులకు వాకిటాకీలు

జోగుళాంబ శక్తిపీఠం: అలంపూర్ జోగుళాంబ బాల బ్రహ్మేశ్వర ఆలయంలో కమ్యూనికేషన్ కోసం వాకీటాకీలను అందజేశారు. శనివారం ఆలయంలో ఎమ్మెల్యే విజయుడు, ఈవో పురేందర్‌కుమార్, చైర్మన్ చిన్నకృష్ణయ్య వాటిని ఆవిష్కరించారు. పురాతన రాతికట్టడి ఆలయాలు కావడంతో ఆలయం లోపల సెల్‌ఫోన్ సిగ్నల్ లేని సమస్యల కారణంగా కమ్యూనికేషన్ కోసం వాకిటాకీలను అందుబాటులోకి తెచ్చినట్లు ఆలయ ఈఓ పురేందర్‌కుమార్ తెలిపారు.

చౌడేశ్వరిదేవికి గంగస్నానం

పెబ్బేరు రూరల్: పట్టణ కేంద్రంలో చౌడేశ్వరి జాతర సందర్భంగా శనివారం అమ్మవారికి గంగ స్నానం చేయించారు. యాదవులు కుర్వ డోళ్లు, భాజా భజంత్రీలతో అమ్మవారిని గంగస్నానానికి తీసుకెళ్లారు. ఈ సందర్భంగా పట్టణంలోని పుర వీధుల్లో భక్తులు అమ్మవారికి నిండు బిందె నీళ్లతో పూజలు చేశారు. అనంతరం రాత్రి పదకొండు గంటల నుంచి ఆదివారం తెల్లవారు జామున వరకు అమ్మవారి పల్లకీసేవ, జ్యోతుల కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు చౌడేశ్వరి దేవి ఉత్సవ కమిటీ సభ్యులు తెలిపారు. ఆదివారం ఉదయం ఎనిమిది గంటల నుంచి సోమవారం రాత్రి వరకు అమ్మవారిని భక్తుల సందర్శన కోసం చిన్న చౌడేశ్వరీ ఆలయంలో ఉంచుతారు.

వైభవంగా వేంకటేశ్వరస్వామి కల్యాణం

అడ్డాకుల: వేములలో శనివారం రాత్రి లక్ష్మీవేంకటేశ్వరస్వామి కల్యాణాన్ని కనుల పండువగా నిర్వహించారు. తిరుమల తిరుపతి మహా పాదయాత్రలో భాగంగా 21వ రోజు గ్రామంలోని ఆంజనేయ స్వామి ఆలయం ముందు వేదపండితులు కల్యాణాన్ని జరిపించారు. గడప గడపకు గోవు, గోవిందుడు, గీత కార్యక్రమాన్ని గట్టు రంగాచార్యుల సంకల్పంలో భాగంగా తిరుపతిగారి ప్రభాకర్‌రెడ్డి ఆధ్వర్యంలో కార్యక్రమాన్ని నిర్వహించారు. గ్రామస్తులు పెద్ద సంఖ్యలో హాజరై కల్యాణాన్ని తిలకించారు. కల్యాణం అనంతరం తీర్థప్రసాదాలను అందజేశారు. భగవద్గీతపై ప్రచారం, గో ఆధారిత వ్యవసాయం, పర్యావరణ పరిరక్షణ, ప్లాస్టిక్ రహిత గ్రామాల ఏర్పాటు, నక్షత్రవనం మొక్కలు నాటడమే లక్ష్యంగా కార్యక్రమాన్ని చేపట్టినట్లు ప్రభాకర్‌రెడ్డి తెలిపారు. రాత్రి ఆలయం వద్ద గ్రామస్తులకు అన్నదానం చేశారు.